క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత



చిలకలపూడి(మచిలీపట్నం): మల్కాపట్నానికి చెందిన బి. మనోజ్‌కుమార్ ఇటీవల విద్యుత్ స్తంభం ఎక్కి వైర్లు సరిచేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఎడమచేయి మోచేతి వరకు కోల్పోవడమే కాకుండా శరీరం మొత్తం గాయాలయ్యాయి. విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న బెరాకా మినిస్ట్రీస్ అధినేత బీఎస్ కిరణ్‌పాల్ రూ. 45 వేల చెక్కును మనోజ్‌కుమార్‌కు శనివారం అందజేశారు. కార్యక్రమంలో నాగిశెట్టి డానియేల్, కొడాలి చిన్నా, కొండేటి రాజేష్, పల్లి శామ్యూల్‌రాజు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ పాదయాత్ర



మచిలీపట్నంటౌన్: ఎస్సీ వర్గీకరణకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని కోరుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) ఆధ్వర్యంలో శనివారం నగరంలో పాదయాత్ర నిర్వహించారు. ఎస్‌ఎన్ గొల్లపాలెంలో ప్రారంభమైన పాదయాత్ర రాజుపేట, బలరామునిపేట, రాజీవ్‌నగర్, అంబేడ్కర్ సర్కిల్, కోనేరు సెంటర్, మల్కాపట్నం వరకు సాగింది. కార్యక్రమంలో సంఘ నాయకులు కొల్లూరి బసవమాదిగ, బీడెల్లి మరియకుమార్ మాదిగ, శీలం శర్మ మాదిగ, మట్టా గోపాలకృష్ణ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణ అందరి బాధ్యత



చల్లపల్లి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శీరం వెంకట సత్యనారాయణ (నాని) అన్నారు. శనివారం స్థానిక జాతీయ రహదారికి ఇరువైపులా నూకలవారిపాలెం రోడ్డు వరకు మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. స్వచ్ఛ సుందర చల్లపల్లి కన్వీనర్లు డాక్టర్ డీఆర్కే ప్రసాద్, డాక్టర్ తరిగోపుల పద్మావతి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో నాని పాల్గొని మొక్కలు నాటారు. 2,900 రోజులకు పైగా గ్రామ సుందరీకరణకు కృషి చేస్తున్న స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తలు ఆదర్శనీయులని అన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యకర్తలు పాల్గొన్నారు.

శివరామకృష్ణ క్షేత్రానికి రూ.50,116 విరాళం



కోడూరు: కోడూరులో నూతనంగా నిర్మిస్తున్న శివరామకృష్ణ క్షేత్రానికి ప్రముఖ వ్యాపారి యండూరి వీరభద్ర నాంచారయ్య–రాజ్యలక్ష్మి దంపతులు రూ.50,116 నగదును విరాళంగా అందించారు. శనివారం ఈ మొత్తాన్ని కమిటీ సభ్యులకు అందించారు. పూర్తి గ్రానైట్‌తో నిర్మిస్తున్న ఆలయానికి తమవంతు సహాయం అందించడం ఆనందంగా ఉందని వీరభద్ర నాంచారయ్య దంపతులు తెలిపారు. కమిటీ సభ్యులు అన్నం వెంకట సుబ్బారావు, బూరగడ్డ హరినాథ్‌బాబు, జూపూడి సుభాష్ చంద్రబోస్, అన్నం శివరామకృష్ణ, తూనుగుంట్ల మహేష్, అన్నం సురేంద్ర పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావన పెంపొందాలి



పామర్రు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావన పెంపొందాలని, అప్పుడే సమాజం శాంతియుతంగా మారుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ జేఈవో, కృష్ణా జిల్లా మాజీ కలెక్టర్ డాక్టర్ బీ లక్ష్మీకాంతం అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం పర్యటనలో భాగంగా పామర్రుకు శనివారం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవత్ చింతనను అందరూ అలవర్చుకోవాలన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ వలన గ్రామాల్లో సోదర భావం పెరుగుతుందని అన్నారు. అనంతరం పామర్రు అయ్యప్ప స్వాములు, లక్ష్మీకాంతం సేవా సమితి ఆర్గనైజేషన్ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయనను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానికులు అయ్యప్ప దీక్షాపరులు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



విద్యుత్ దీపాల వెలుగులో బందరులోని కన్యకాపరమేశ్వరి ఆలయం



విద్యుత్ దీపాల వెలుగులో బందరులోని శక్తిగుడి

దసరాకు ఆలయాలు ముస్తాబు

- నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు
- ప్రతి రోజూ వివిధ అలంకారాల్లో అమ్మవారి దర్శనం
- ఏర్పాట్లు పూర్తిచేసిన ఆలయ కమిటీలు, నిర్వాహకులు

పెడన: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు పెడన, మచిలీపట్నం, అవనిగడ్డ నియోజకవర్గాల్లో ఆలయ కమిటీలు, నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే ఆలయాలను సుందరంగా ముస్తాబు చేశారు. పలు కూడళ్లలో అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. పెడన పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం ఉదయం 4.30 గంటలకు సుప్రభాత సేవతో విజయ దశమి వేడుకలు ప్రారంభమవుతాయి. 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు వివిధ రూపాలలో అమ్మవారిని అలకరించి పూజలు చేస్తామని ఆలయ కమిటీ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు కొల్లూరి చిన్నా తెలిపారు. అలాగే పైడమ్మ దేవస్థానంలో అమ్మవారిని వివిధ రూపాలలో అలకరిస్తామని, మొదటి రోజున బాలా త్రిపుర సుందరిదేవి అలంకరణలో పైడమ్మ దర్శనమిస్తారని ఆలయ ఈఓ టీవీవీ మోహనరావు తెలిపారు. మఠం వీధిలో యువత అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

- **కృత్తివెన్ను:** మండల పరిధిలోని అడ్డపర్ర, నీలిపూడి, యండపల్లి, లక్ష్మీపురం, చందాల, కృత్తివెన్ను శివాలయం, చినపాండ్రాక, చినగొల్లపాలెం, పోడు, పల్లెపాలెం, మాట్లం తదితర గ్రామాలలో నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయా ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేస్తామని చెప్పారు. ప్రతిరోజూ అమ్మవార్లు వివిధ రూపాల్లో దర్శనమిస్తారని వివరించారు.
- **గూడూరు:** గూడూరులో ప్రసిద్ధి చెందిన గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం అవుతాయని ఆలయ కార్యనిర్వహణాధికారి టీవీవీ మోహనరావు తెలిపారు. ఆదివారం బాలాత్రిపుర సుందరీ దేవి, సోమవారం ఇష్ట కామేశ్వరీదేవి, ఈనెల 17వ తేదీన పరాశక్తి దేవి, 18న గాయత్రీ దేవి, 19న కాశీ అన్నపూర్ణాదేవి, 20న సరస్వతీదేవి, 21న ధనలక్ష్మీదేవి, 22న దుర్గాదేవి, 23న రాజరాజేశ్వరీదేవి అలంకారాలలో అమ్మవారు దర్శనమిస్తారని చెప్పారు. చివరి రోజు విజయ దశమిని పురస్కరించుకుని ఆలయంలో శమీ పూజ నిర్వహిస్తామని వివరించారు.



విద్యుత్ దీపాలంకరణలో పెడన కన్యకా పరమేశ్వరి ఆలయం



బందరులో కాళీమాత ఆకృతిలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు



కోడూరు గంగాభవాని అమ్మవారు

ఆలయాలకు నూతనశోభ

మచిలీపట్నంటౌన్: జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు అమ్మవారి ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆలయాలు నూతన శోభను సంతరించుకున్నాయి. విద్యుత్ దీపాలతో పలు డిజైన్లతో పాటు అమ్మవారి ఆకారంలో బోర్డులు ఏర్పాటు చేశారు. ఈడేపల్లిలోని శక్తిగుడి వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాల అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రాబర్ట్‌సన్‌పేటలోని కన్యకా పరమేశ్వరి ఆలయం, రాజుపేటలోని ముత్యంగుడి, పెద్దవీధి రామాలయం, బుట్టాయిపేటలోని దత్తాశ్రమం, భాస్కరపురంలోని త్రిశక్తిపీఠం, ప్రధాన రహదారిలోని దుర్గగుడి, గీతామందిరం తదితర ఆలయాలను ముస్తాబు చేశారు. ఆదివారం నుంచి ఆలయాల్లో శరన్నవరాత్రి పూజా కార్యక్రమాలు ప్రారంభంకానున్నాయి. తొమ్మిది రోజుల పాటు అమ్మవార్లు ప్రత్యేక అలంకారాలలో భక్తులకు దర్శనం ఇస్తారు. శరన్నవరాత్రిలో భాగంగా శనివారం సాయంత్రం శక్తిగుడి వద్ద మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు కోళ్లు, మేకలను వాయిద్యాల నడుమ నగరంలో ఊరేగిస్తూ ఆలయానికి చేరారు.

- **కోడూరు:** దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని అమ్మవారి ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహణకు ఆలయ కమిటీలు దేవాలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. కోడూరు గంగాభవానీ, కనకదుర్గమ్మ, విశ్వనాథపల్లి, మందపాకల అద్దంకి నాంచారమ్మ, మాచవరం తుంగపల్లెమ్మ, కోడూరు దానాశక్తి, హంసలదీవి, ఉల్లిపాలెం రాజ్యలక్ష్మి అమ్మవార్ల ఆలయాల్లో ఉత్సవాలను ఆదివారం ఉదయం నుంచి ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవార్లను ప్రత్యేక అలంకారాల్లో తీర్చిదిద్ది భక్తులకు దర్శనం కల్పిస్తామని తెలిపారు.

జరిగిన మంచిని చూసి ఆదరించండి

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- మోదుమూడిలో గడప గడపకు మన ప్రభుత్వం

మోదుమూడి(అవనిగడ్డ): గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ రాష్ట్ర ప్రజలకు ఎంతో మేలు చేశారని, జరిగిన మంచిని చూసి మరోసారి ఆదరించాలని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మండల పరిధి మోదుమూడిలో శనివారం ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలువురు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను త్వరతగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పేద ప్రజందరికీ విద్య, వైద్యం, రైతు సంక్షేమంతో పాటు ఆర్థికంగా ఎదిగేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. మన రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలను ఇతర రాష్ట్రాలు అనుకరిస్తున్నాయన్నారు. ఈ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లేలా సీఎం జగనన్న జనరంజక పాలన అందిస్తున్నారని తెలిపారు. టీడీపీ, జనసేన పనిగట్టుకుని ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేస్తున్నాయని, ప్రజలు వీరిని విశ్వసించడం లేదని, మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కట్టేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారని చెప్పారు. మరోసారి అవకాశం ఇస్తే మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తారని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువ నేత సింహాద్రి వికాస్, ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, పలు శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, నాయకులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

జోగేశ్వరరావు మృతికి ఎమ్మెల్యే సంతాపం

మోపిదేవి: ఏపీఎస్ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి పీతా జోగేశ్వరరావు(73)అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మోపిదేవిలోని వారి ఇంటికి వెళ్లి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతునికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

రేపటి నుంచి పాలకొల్లుకు బస్సు సర్వీస్

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నుంచి పాలకొల్లుకు ఈ నెల 16వ తేదీ నుంచి ఏపీఎస్ ఆర్టీసీ నూతన బస్సు సర్వీసును ప్రారంభిస్తుందని డిపో మేనేజర్ టి. పెద్దిరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రతి 45 నిమిషాలకు ఒక బస్సు సర్వీసు మచిలీపట్నం నుంచి పాలకొల్లుకు బయలు దేరుతుందన్నారు. ఈ నూతన బస్సు సర్వీసును ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

పెదకళ్లేపల్లి(మోపిదేవి): రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు తమ విద్యార్థులు ఇద్దరు ఎంపికయ్యారని పెదకళ్లేపల్లి జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం బి. అనూరాధ తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ విజయవాడ ఐజీఎంసీ స్టేడియంలో సెప్టెంబర్ 27వ తేదీన జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌లో అండర్–17 ఫుట్‌బాల్ బాలికల విభాగంలో తమ విద్యార్థిని జె. తేజస్విని ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని చెప్పారు. కర్నూలులో త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి జట్టులో తేజస్విని పాల్గొంటుందన్నారు. ఈనెల 10వ తేదీ పామర్రు జెడ్పీ పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ రోప్ స్కిప్పింగ్ అండర్–17 బాలుర విభాగంలో ఎ. పవన్ శివగణేష్ ఎంపికయ్యాడని చెప్పారు. భీమవరంలో జరిగే రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో పాల్గొంటారని వివరించారు. విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ ఏవీ తాతారావును ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం అనూరాధ

కోర్టు ప్రాంగణంలో అన్నసమారాధన

గుడివాడ టౌన్: స్థానిక కోర్టు ప్రాంగణంలో శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు, కోర్టు ఉద్యోగులు, సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రుల ముగింపు సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. 11వ అదనపు జిల్లా జడ్జి జి.సుబ్రహ్మణ్యం అన్నసమారాధనను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మలచర్ల శ్రీనివాస్, సీహెచ్ వెంకట రమణ, ఉపాధ్యక్షుడు సీహెచ్ కుటుంబరావు, న్యాయవాదులు హరనాథ్, రఫీ, న్యాయవాద గుమస్తాలు, కోర్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

అక్కినేని పోస్టల్ స్టాంపు ఆవిష్కరణ

గుడివాడ టౌన్: సినీనటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలు స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో శనివారం జరిగాయి. అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకుడు ఎం.రామకృష్ణ, ఆల్ ఇండియా ఏఎన్నార్ ఫ్యాన్స్ కార్యదర్శి వడ్డాది రాజేష్ ఆధ్వర్యంలో ఏఎన్నార్ కళాశాల ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్రం నలుమూలల నుంచి ఏఎన్నార్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తొలుత అక్కినేని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 1959లో ఈ కళాశాల నిర్మాణానికి రూ.లక్ష వితరణగా ఇచ్చిన విద్యా దాత అక్కినేని అని అన్నారు. కళాశాల పూర్వ విద్యార్థి, ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ దేవ నరసింహారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అక్కినేని పోస్టల్ స్టాంపులను నిర్వాహకులు ఆవిష్కరించారు. అనంతరం అక్కినేని జీవిత సాఫల్య పురస్కార గ్రహీత వడ్డాది రాజేష్‌ను ఘనంగా సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, కార్యదర్శి కేఎస్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



తపాలా స్టాంప్‌లు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

విద్యార్థులకు పాసు పుస్తకాల పంపిణీ

మండవల్లి: విద్యార్థి దశ నుంచే బ్యాంకు సేవలు వినియోగించుకోవాలని స్థానిక ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు అన్నారు. మండలంలోని లోకుమూడి హైస్కూల్‌లో శుక్ర, శనివారాల్లో వంద మంది విద్యార్థులకు జీరో బ్యాలెన్స్‌తో ఖాతాలను తెరచి పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం.వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఆర్థిక అక్షరాస్యత, పొదుపు, బ్యాంకు లావాదేవీల నిర్వహణపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ విద్యార్థులు పొదుపుపై అవగాహన పెంపొందించుకోవడం వలన ఆర్థిక క్రమశిక్షణ అలవడి, దురలవాట్లకు దూరంగా ఉండి ఉత్తమ పౌరులుగా విలసిల్లుతారన్నారు. మండవల్లి హైస్కూల్‌లో 150 మంది విద్యార్థులకు, లింగాల హైస్కూల్‌లో 200 మంది విద్యార్థులకు జీరో అకౌంట్ తెరచినట్లు పేర్కొన్నారు.



విద్యార్థులతో బీఎం దుర్గారావు, తదితరులు

ఇప్పుడే వచ్చేస్తా అక్కా..

- అంతలోనే వెంటాడిన మృత్యువు
- విషాదాన్ని మిగిల్చిన ఈత సరదా
- నిన్ననే సెలవులకు వచ్చి మృత్యువాత పడిన సిద్ధార్థ

అవనిగడ్డ: ఒరే ఎక్కడికి వెళుతున్నావురా.. ఎండగా ఉంది.. వచ్చేయ్ అన్న అక్కమాటకు ఇప్పుడే వచ్చేస్తాను అక్కా అని చెప్పిన తమ్ముడు హుషారుగా బయటకు వెళ్లాడు. అలా వెళ్లిన తమ్ముడు ఆవుల సిద్ధార్థ స్నేహితులతో కలిసి కాలువలో ఈతకు వెళ్లి మృత్యువాత పడటంతో కన్నీరు మున్నీరుగా ఆ కుటుంబం విలపిస్తోంది. దసరా సెలవులకని నిన్ననే వచ్చిన భరత్ సరదాగా ఈతకని వెళ్లి కనబడక పోవడంతో కుటుంబ సభ్యుల రోదన చూపరులను కలచి వేస్తోంది. ఈత సరదా ఆ రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం మిగిల్చింది.

ఇప్పుడే వచ్చేస్తానని చెప్పి వెళ్లి..

అవనిగడ్డ పంచాయతీ పరిధిలోని సింహాద్రి కాలనీకి చెందిన తమటం సతీష్, ఆవుల సిద్ధార్థ (12), వల్లముల భరత్ (బాలయ్య 14), వల్లముల నాగ చైతన్య సరదాగా ఈతకని వెళ్లారు. సీతాయిలంక అంబేడ్కర్ విగ్రహం ఎదురుగా పంటకాలువలో దిగారు. కాలువలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో కొద్దిదూరం వెళ్లిన సిద్ధార్థ, భరత్ నీటి ఉధృతికి కొట్టుకు పోయారు. మిగిలిన ఇద్దరూ ఒడ్డుకు వచ్చి కాలువలో మునిగిపోయిన ఆ ఇద్దరిని కాపాడండి అంటూ కేకలు వేశారు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడం, ఒకరిద్దరు వాహనదారులు ఆగినా వారికి ఈత రాక వెళ్లిపోయారు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో కాలనీకి చెందిన కొంతమంది యువకులు కాలువలోకి దిగి గాలింపు చర్యలు చేపట్టారు. అయినా వీరిద్దరి జాడ కనబడలేదు. కొంత సమయం తరువాత సమీపంలో సిద్ధార్థ మృతదేహం లభించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. వద్దని వారించినా వెళ్లి మృత్యువాత పడటంతో సిద్ధార్థ అక్క లావణ్య ఒక్కసారి లేవరా.. నాతో మాట్లాడరా.. వద్దన్నా వెళ్లి ఇలా మాట్లాడకుండా పడుకున్నావేంటిరా అంటూ విలపిస్తున్న తీరు చూపరులను కలచి వేసింది. ఒక్కగానొక్క కుమారుడు ఇలా మృత్యువాత పడటంతో తల్లిదండ్రులు లక్ష్మీనారాయణ, ధనలక్ష్మి, చెల్లి శ్రావణ సిరి సిద్ధార్థ మృతదేహంపై పడి విలపిస్తున్న తీరు ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది.



విలపిస్తున్న సిద్ధార్థ తల్లి, సోదరి

నిన్ననే దసరా సెలవులకు వచ్చి..

అదే కాలనీకి చెందిన వల్లముల భరత్ (బాలయ్య) (14) తల్లి లత ఆర్నేళ్ల కిందట చనిపోగా, తండ్రి అంకాలయ్య మూడేళ్ల కిందట ఇల్లు వదలి వెళ్లిపోయాడు. మేనత్త గాలం పార్వతి భరత్‌ని చదివిస్తోంది. భట్టిప్రోలులో హాస్టల్‌లో ఉంటూ ఎనిమిదో తరగతి చదువుతున్న బాలయ్య దసరా సెలవులు ఇవ్వడంతో శుక్రవారం అవనిగడ్డ వచ్చాడు. సరదాగా ఈతకని వెళ్లి గల్లంతయ్యాడు. అతని ఆచూకీ లభించక పోవడంతో సోదరి మానస, తమ్ముడు శ్యాం కన్నీళ్లను దిగమింగుకుని ఎదురు చూస్తు న్నారు. బాలయ్య ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

మృతుని కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే సింహాద్రి పరామర్శ

విషయం తెలుసుకున్న అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, ఎంపీటీసీ దిడ్ల కిరణ్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు వైద్యశాలకు వెళ్లి సిద్ధార్థ మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. పోస్టుమార్టం అనంతరం సిద్ధార్థ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. బాలయ్య ఆచూకీ కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేయాలని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు.



వైద్యశాలలో సిద్ధార్థ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి



గాలిస్తున్న యువకులు

మతోన్మాదంతో భారత రాజ్యాంగానికి ముప్పు

కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రఘు

మచిలీపట్నంటౌన్: దేశంలో మతోన్మాదం పెద్దఎత్తున పెరిగి భారత రాజ్యాంగానికి తీవ్ర ప్రమాదం ఏర్పడుతోందని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం కృష్ణా జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్. రఘు అన్నారు. స్థానిక బుట్టాయిపేటలోని జ్యోతిరావు పూలే విజ్ఞాన కేంద్రంలో కేవీపీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి 'ప్రమాదంలో రాజ్యాంగం–నేటి కర్తవ్యం' అంశంపై సదస్సు నిర్వహించారు. రఘు మాట్లాడుతూ భారతీయులుగా ఈ రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో శాస్త్రీయ దృక్పథాన్ని తీసివేసి ప్రజల మధ్యన అనైక్యతను సృష్టించి మతోన్మాద ఎజెండాతో ముందుకు వెళుతున్నారని విమర్శించారు. ఈ ప్రమాదాన్ని భారతీయులుగా ప్రతి ఒక్కరు కలిసికట్టుగా ఎదుర్కోవాలని, బీఆర్ అంబేడ్కర్ రాసిన భారతరాజ్యాంగం దేశ ప్రజలదని నిరూపించాలని చెప్పారు. ఇప్పటికే అనేక సంస్థల్లో మార్పులు తీసుకువచ్చి తన మతోన్మాద ఎజెండాతో బీజేపీ ముందుకు వెళుతోందన్నారు. సామాజిక కార్యకర్త జీవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ పౌరుల హక్కులు నేడు పూర్తిగా కాలరాయబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మానవ హక్కుల నాయకులను, ప్రశ్నించే వారిని ఉప చట్టం కింద అరెస్టు చేసి చిత్రహింసలకు గురిచేస్తున్నారని విమర్శించారు. బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడే వారిని జైలుకు పంపుతున్నారని చెప్పారు. పత్రికా స్వేచ్ఛకు, ప్రజాస్వామ్యానికి, లౌకికతత్వానికి తూట్లు పొడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల్, జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రాజేష్, జిల్లా ఉపాధ్యక్షుడు కొడాలి శర్మ, నగర అధ్యక్ష, కార్యదర్శులు మిరియాల ఆనంద్ బెనర్జీ, పేటేటి రాజు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఆర్. రఘు

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కార్యదర్శి కారుమూరి రాజేంద్రప్రసాద్, చేబ్రోలు ఆశీర్వాదం అన్నారు. ఇటీవల రాష్ట్ర కమిటీలో బాధ్యతలు స్వీకరించిన వీరిని జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక సంఘ భవనంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కాకినాడలో జరిగిన సంఘ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో జరిగిన ఎన్నికల్లో తమను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు. ప్రతి నెలా మొదటి తేదీనే పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘ నగర యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు బి. మునలయ్య, సీహెచ్ నాగేంద్రరావు, కోశాధికారి డొమినిక్, జిల్లా ప్రతినిధులు ఎల్. వెంకటేశ్వరరావు, బీకే దుర్గారావు, ఎం. సత్యనారాయణ పాల్గొన్నారు.



రాజేంద్రప్రసాద్, ఆశీర్వాదంను సన్మానించిన రిటైర్డ్ ఉద్యోగ సంఘ నాయకులు